క్లుప్తంగా

జీవో 142 రద్దు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న వైద్యరోగ్య సంఘం సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: వైద్యారోగ్యశాఖ ఉద్యోగులకు నష్టం కలిగించే జీవో నం.142ను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ వైద్యరోగ్య ఉద్యోగుల అనుబంధ సంఘం హెచ్‌వన్ బీఆర్ఎస్‌కేవీ జిల్లా శాఖ నాయకులు కోరారు. శనివారం సంఘం అధ్యక్షుడు బండారి కృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జోగురామన్నను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషనలైజేషన్ ద్వారా జిల్లాలోని పోస్టులు ఇతర జిల్లాలకు తరలుతున్నాని, దీంతో జిల్లాలోని ఉద్యోగులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ విషయంపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, హెల్త్ డైరెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చూడాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి అల్లాడి రఘురాం, కార్యనిర్వాహక అధ్యక్షుడు రమణాచారి, సహా అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పూసాయి వాసికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న దేవన్న

ఆదిలాబాద్‌రూరల్: జైనథ్ మండలం పూసాయి గ్రామానికి చెందిన సిల్వర్ దేవన్న డాక్టరేట్ పట్టా అందుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం అర్థశాస్త్రం విభాగం పరిశోధనకు గాను యూనివర్సిటీ డాక్టరేట్ పట్టా పొందాడు. సోషియో ఎకనావిక్ అండ్ హెల్త్ డెవలప్‌మెంట్ ఆఫ్ ప్రిమిటివ్ ట్రైబ్స్ ఏ స్టడీ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి డాక్టరేట్ ప్రదానం చేశారు.

కేసీఆర్, జోగు రామన్న ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ, నాయకులు

జైనథ్: మండలంలో నాణ్యమైన విద్యుత్ సేవల కోసం ప్రభుత్వం రూ.27 కోట్లు మంజూరు చేయడంపై బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న ఫ్లెక్సీకి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, మద్దుల ఊశన్న, గణేశ్ యాదవ్, నోముల సంతోష్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇంటింటికీ కాంగ్రెస్ గ్యారంటీ హామీలు



గ్యారెంటీల పోస్టర్‌ను విడుదల చేస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: హైదరాబాద్‌లోని తుక్కుగూడ సభలో కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ హామీలను ఇంటింటికీ తీసుకెళ్లి పార్టీ జెండాను ఎగురవేస్తామని నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆరు గ్యారెంటీ హామీల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సంతోష్‌రావు, శంకర్, షకీల్, సుజాత్ అలీ, రవి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదరించండి.. గ్రామాలను అభివృద్ధి చేస్తా

తలమడుగు: వచ్చే ఎన్నికల్లో ఆదరించండి.. గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ పేర్కొన్నారు. మండలంలోని పల్లి(బి), మదనపూర్ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. గణేశ్ మండపాల వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకుని త్వరలో పరిష్కరిస్తానని హామీఇచ్చారు. పల్లి(బి) గ్రామంలో మాజీ సర్పంచ్ నరసింహులు, పలువురు యువకులు బీఆర్ఎస్ చేరగా, కండువా కప్పారు. అనంతరం గ్రామస్తులు అనిల్ జాదవ్‌ను సన్మానించారు. సర్పంచ్ కుమ్ర మాల్కు, ఝరి సహకార చైర్మన్ వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, కేదారేశ్వర్‌రెడ్డి, జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వసంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏకదంతం.. భిన్నరూపం



శివాలయం వద్ద..



రాంనగర్‌లో ఇటీవల విజయవంతమైన చంద్రయాన్-3 రూపంలో..



భుక్తాపూర్‌లో..చాక్లెట్ గణనాథుడు

వినాయక నవరాత్రోత్సవాలు పురస్కరించుకుని పట్టణంలోని వివిధ గణేశ్ మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథుని విగ్రహాలు వినూత్నరీతిలో ఆకట్టుకుంటున్నాయి. అధ్యాత్మికతతో పాటు సామాజిక సందేశాన్ని చాటుతున్నాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



చించర్‌వాడ సమీపంలో..



చోటతలాబ్‌లో రక్తవర్ణంలో గణపతి..



భుక్తాపూర్‌లో..



బ్రహ్మణ్‌వాడ శాస్త్రీమందిర్ వద్ద..

ఆర్టీసీ ఉద్యోగికి అండగా..



ఆర్థికసాయం అందజేస్తున్న ఉద్యోగులు

ఆదిలాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న తోటి ఉద్యోగికి ఆర్టీసీ ఉద్యోగులు అండగా నిలిచారు. ఆదిలాబాద్ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్యాంసుందర్ మెదడులో రక్తస్రావం కారణంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్సకు రూ.15 లక్షల ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. చెల్లించే ఆర్థికస్తోమత లేని కుటుంబ సభ్యులకు ఆదిలాబాద్ డిపో ఆర్టీసీ అధికారులు, కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్లు తమవంతుగా ఆర్థికసాయం చేశారు. ఉద్యోగులంతా కలిసి రూ.1,10,000లను శనివారం ఆదిలాబాద్ డిపో గ్యారేజీలో వారికి అందజేశారు. జీఆర్ మౌళి, ఎంబి.రావు, జె.లింగన్న, ఏవీఆర్ కిషన్, శ్రీ సతీశ్, పి.సంజీవ్ కుమార్, సీఎస్ రాజ్ ఉన్నారు.

ఖానాపూర్ సీఐని సస్పెండ్ చేయాలని రాస్తారోకో

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఉట్నూర్ ఐబీ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఖానాపూర్ మండలం రాజురా గ్రామంలో శుక్రవారం దళితులపై దాడి చేసిన సీఐ మోహన్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు రాథోడ్ రితేశ్ డిమాండ్ చేశారు. రితేశ్ రాథోడ్, రాజశేఖర్, వెంకటేశ్, లింగాగౌడ్, రాజేశ్వర్, సతీశ్, రవి, భూపతి, శేషరావు, శ్రీకాంత్, కిరణ్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

- డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

బోథ్: పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. మండలంలోని కౌఠ(బి) గ్రామంలో నివేదిత అనే బాలిక శుక్రవారం జ్వరంతో చనిపోవడంతో ఆయన శనివారం గ్రామంలో పర్యటించారు. బాలిక ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఇంట్లోనూ పలువురు జ్వరంతో బాధపడుతుండటంతో వారి రక్త నమూనాలు సేకరించి, వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం జీపీలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇళ్లలో కొబ్బరిబోండాలు, టైర్లలో నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. పలువురి ఇళ్లలో నీటి నమూనాలు సేకరించారు. జిల్లా మలేరియా అధికారి శ్రీధర్, వైద్యాధికారి నవీన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్

బజార్‌హత్నూర్: ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ పేర్కొన్నారు. మండలంలోని దేగామ గ్రామంలో శనివారం ఇంటింటికి వెళ్లి దోమల నివారణకు పలు సూచనలు చేశారు. అనంతరం పారిశుధ్య పనులు పరిశీలించారు. డీఎంవో శ్రీధర్, మెడికల్ ఆఫీసర్ భీంరావ్, సర్పంచ్ దుర్వ లక్ష్మణ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఇచ్చోడ: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని బోథ్ మున్సిఫ్ కోర్టు జడ్జి హుస్సేన్ అన్నారు. మండలంలోని జల్దా గ్రామంలో మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హుస్సేన్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే గ్రామపెద్దలతో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. విద్యా, బాలల హక్కులు, పీడీ యాక్టులు, ఎక్సైజ్ చట్టాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ జ్యోతిగిత్తే, న్యాయవాదులు దమ్మపాల్, అంగద్‌ఠేంద్రే, ఏజీపీ విక్రమ్‌సింగ్, ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ చంద్రమౌళి, ఎస్సై లక్ష్మణ్, కోర్టు పీసీలు పురుషోత్తం, దివాకర్, కోర్టు సిబ్బంది స్రవంతి పాల్గొన్నారు.

ఎదులాపురం: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ యశోధ అన్నారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మీ పారామెడికల్ కళాశాలలో శనివారం జిల్లా మిషన్‌శక్తి, మహిళ సాధికారత కేంద్రాల ఆధ్వర్యంలో బేటి బచావో-బేటి పడావోలో భాగంగా బాలలను రక్షిద్దాం-బాలలను చదివిద్దాం అనే అంశంపై అవగాహన కల్పించారు. జిల్లా సాధికారత కేంద్రం బృందం క్రిష్ణా వేణి, కోటేశ్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోథ్ మున్సిఫ్ జడ్జి హుస్సేన్

ఆదిలాబాద్‌రూరల్: చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని షీ టీం ఇన్‌చార్జి ఏఎస్సై సునీత అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

తాంసి: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో తాంసి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జామిడి, పొన్నారి గ్రామాల్లో శనివారం వైద్యశిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారి శ్రావ్య, సిబ్బంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. అలాగే పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్పంచులు కేశవ్‌రెడ్డి, అశోక్, ఎంపీటీసీ రేఖ ఉన్నారు.

ఉట్నూర్‌రూరల్: హీరాపూర్‌లో హస్నాపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.



జామిడిలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శ్రావ్య

నార్నూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్, హెచ్‌ఈ నాందేవ్, ఏఎన్ఎం తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి



హేటిలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

బేల: బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. మండలంలోని హేటి గ్రామంలో రూ.2 లక్షల వ్యయంతో సీసీ ప్లాట్‌ఫాం, రూ.5లక్షల వ్యయంతో కమ్యూనిటీ షెడ్ పనులకు శనివారం భూమిపూజ చేశారు. ఎకోరి గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో పంచాయతీ భవన నిర్మాణం, భవానీగూడ(ఇ) గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో కమ్యూనిటీ షెడ్ పనులు ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఠాక్రే గంభీర్, సతీశ్ పవార్, సుదర్శన్, దంతెల వినోద్, సునీల్ పాల్గొన్నారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం

తాంసి: భీంపూర్ మండలం కరంజి(టి), వడూర్, అంతర్గాం, భీంపూర్ తదితర గ్రామాల్లో శనివారం గణేశ్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. డీజే చప్పుల మధ్య యువకులు నృత్యాలు చేస్తూ శోభాయాత్ర చేశారు. వాగుల్లో పూజలు నిర్వహించి గణనాథులను నిమజ్జనం చేశారు.



అంతర్గాంలో నిమజ్జన సమయంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్
- అక్రమాలకు పాల్పడుతున్న ఐకేపీ సీసీపై చర్యకు సభ్యుల డిమాండ్
- సరెండర్ చేయాలని ఫోన్‌లో డీఆర్‌డీవోకు ఆదేశాలు

నార్నూర్: అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా కొనసాగింది. స్త్రీనిధి రుణాల కోసం ఐకేపీ సీసీ కిషన్ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగీర్ ఆరోపించారు. ఈ విషయమై ఐకేపీ ఏపీఎం రమేశ్‌ను జెడ్పీ చైర్మన్ ప్రశ్నించారు. స్త్రీనిధి రుణాల మంజూరు ఎలాంటి అక్రమాలు జరగడం లేదని, రుణాలపై త్వరలో సోషల్ అడిట్ నిర్వహిస్తామని సభా దృష్టికి తీసుకెళ్లారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. సీసీ కిషన్ వెంటనే సరెండర్ చేయాలని డీఆర్‌డీవో కిషన్‌ను ఫోన్‌లో ఆదేశించారు. బేతాల్‌గూడ పంచాయతీ పరిధిలోని సోనాపూర్ గ్రామానికి గత మూడేళ్లుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని సర్పంచ్ సుజాత పరమేశ్వర్ సభా దృష్టికి తెచ్చారు. సిబ్బంది సమ్మెలో ఉన్నారని, గత రెండు రోజుల నుంచి నీటి సరఫరా చేస్తున్నామని ఏఈ సాయికిరణ్ తెలిపారు. సోనాపూర్‌కు కుమురంభీం జిల్లా జైనూర్ మండల నుంచి కనెక్షన్ ఉందని అక్కడి సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు చూడాలన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే ఆత్రం సక్కు సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఖంపూర్ నుంచి మాదాపూర్ వరకు రూ.1.50 కోట్లు, మాన్కాపూర్ నుంచి నాగల్‌కొండ వరకు రూ. 2.40 కోట్లు, గంగాపూర్ సతీశ్రీ పాఠశాల నుంచి గుంజాల వరకు రూ.2.40 కోట్లు, నడ్డంగూడ నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు రూ.2.40 కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి దన్నుగూడ వరకు రూ.60 లక్షలు, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఎంపల్లి గోండుగూడ వరకు రూ.70 లక్షల నిధులు మంజూరైందన్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో సీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, హెచ్ఏలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలతో త్వరలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలని వైద్యుడు డాక్టర్ రాంబాబును జెడ్పీ చైర్మన్ ఆదేశించారు. సమావేశానికి రాని అధికారులకు మెమో జారీ చేయాలని ఎంపీడీవో రమేశ్‌ను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో రమేశ్, సూపరింటెండెంట్ గంగాసింగ్, పీఆర్ జేఈ లింగన్న, ఐటీడీఏ ఏఈఈ సునీల్ రాథోడ్, సీడీపీవో శారద, ఎంఈవో రాపల్లి ఆశన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సుభాణి, ఐకేపీ ఏపీఎం రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

సంక్షిప్త వార్తలు

బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్

బోథ్: బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శిగా భగత్ ప్రవీణ్‌ను శనివారం నియమించినట్లు నియోజకవర్గ అధ్యక్షుడు చిలుముల పంచాక్షరి తెలిపారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసే దిశగా కార్యకర్తలు పనిచేయాలని పంచాక్షరి సూచించారు.

స్వచ్ఛభారత్‌పై అవగాహన

జైనథ్: మండలంలోని బెల్గాం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించారు. స్వచ్ఛతా హీ సేవా పేరిట కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు వివరించారు. ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునన్నారు. తడిచెత్త, పొడి చెత్త నిర్వహణ గురించి తెలియజేశారు. ఎస్‌బీఎం డిస్ట్రిక్ట్ కన్సల్టెంట్ జావెద్, ఉన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ఉట్నూర్‌రూరల్: సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉట్నూర్ భోయవాడ కాలనీలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ సయ్యద్ పర్వేజ్ ఓ ప్రకటనలో తెలిపారు. లేబర్ కార్మదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు వైద్య శిబిరం

గుడిహత్నూర్: మండలంలోని మాన్కాపూర్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక జైదేవీ మెడికల్ యజమాని గిత్తే మదన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పేయ్ హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

ఆదిలాబాద్‌రూరల్: మాజీ ఎంపీ కె.ఆశన్న వర్ధంతి సందర్భంగా కందుల ఆశన్న స్మారక సమితి ఆధ్వర్యంలో కేఆర్కే కాలనీలో గల వృద్ధాశ్రమంలో శనివారం పండ్లు పంపిణీ చేశారు. వైస్ చైర్మన్ కందుల మంజుల, సభ్యులు ముత్యాల సునీత, కేసరి, శరణ్య, శ్రీవర్ధిని, సామాజిక కార్యకర్త బండారి దేవన్న, చాణక్య, వశిష్ఠ, రుద్రంశ్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

తాంసి: భీంపూర్ మండలం బెల్సరీరాంపూర్ గ్రామానికి చెందిన గర్భిణి గంగుబాయి అత్యవసర సమయంలో రక్తం అవసరమైంది. రక్తం కోసం కుటుంబ సభ్యులు మండలానికి చెందిన యువకుడు వెట్టి దేవిదాస్‌ను సంప్రదించారు. తన స్నేహితుడు సెడ్మాకి సుభాష్‌కు ఈ విషయం చెప్పాడు. వెంటనే స్పందించి ఆస్పత్రిలో రక్తదానం చేశాడు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దంతన్‌పల్లిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాసండ్ల ప్రభాకర్ తల్లి శాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో, లక్సెట్టిపేటలో మాజీ సర్పంచ్ సట్ల అశోక్ తండ్రి అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ గేడం నగేశ్ శనివారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, తదితరులు ఉన్నారు. కాటం రమేశ్, సులేమాన్, రాజేశ్వర్, భూమన్న ఉన్నారు.

హెచ్‌ఎంగా బాధ్యతల స్వీకరణ

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం గోపాల్‌సింగ్ తిలవత్ ఇటీవల బదిలీపై తోషంకు వెళ్లారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రవీంద్రచారి శనివారం హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ కాంబ్లే బాపురావ్‌లు ఆయన్ను సన్మానించారు. ఉపాధ్యాయులు నాందేవ్, విశ్వాస్, సుభాష్, జలెంధర్, అమోలిక, రీమ, మీనాక్షి, కవిత ఉన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజమే

ఇచ్చోడ: ఉద్యోగులకు బదిలీలు సహజమేనని ఇచ్చోడ జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం రాథోడ్ ఉదయ్ రావు అన్నారు. బదిలీపై వెళ్తున్న ఆయన్ను శనివారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు.

పరిసరాలు పరిశుభ్రత పాటించాలి

తాంసి: పరిసరాల పరిశుభ్రత పాటించడంతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని భీంపూర్ వైద్యాధికారి నిఖిల్‌రాజు అన్నారు. భీంపూర్ మండలంలోని పలు గ్రామాల్లో వైద్యసిబ్బందితో కలిసి శనివారం పర్యటించారు. పరిసరాల శుభ్రత, నిల్వ నీరు ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గోముత్రి గ్రామంలో ఒకరికి డెంగీ నిర్ధారణ కావడంతో గ్రామాన్ని సందర్శించారు. చుట్టుపక్కల ఇళ్లలో వారి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సిబ్బంది క్లోరినేషన్ చేయించారు. హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, ఏఎన్ఎం సుజాత, పంచాయతీ కార్యదర్శి వివేక్, ఆశ కార్యకర్తలు విమల, సంగీత, రేఖ ఉన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన బెదూర్కర్ సంతోష్ కుమార్ దంపతులను శనివారం రాత్రి కాలనీలోని మైత్రేయ గణేశ్ మండలి ఆధ్వర్యంలో సన్మానించారు. బాశెట్టి వామన్, మహేందర్, వెంకట్‌రావు, తొగరి భాస్కర్, జయవర్ధన్ రెడ్డి, సతీశ్ గుర్నులే పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

ఆదిలాబాద్‌రూరల్: ఈ పంచాయతీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు శనివారం సమ్మె నోటీసును జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులకు అందజేశారు. ఆదిలాబాద్ రూరల్ ఎంపీపీ గండ్రత్ రమేశ్‌ను కలిసి నోటీసును అందించారు.

పోలీసుల విధులపై అవగాహన

ఆదిలాబాద్‌రూరల్: పోలీసు అధికారుల విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి మాస్టర్ మైండ్స్ పాఠశాల యాజమాన్యం వీకెండ్ యాక్టివిటీస్‌లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు పోలీసుల పనితీరు, స్టేషన్‌కు వచ్చే వారితో వ్యవహరించే తీరుపై సీఐ అశోక్ వివరించారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు అందించారు. ప్రిన్సిపాల్ శ్వేతరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసీం తదితరులు పాల్గొన్నారు.

13వ రోజుకు సమ్మె

ఇంద్రవెల్లి: అంగన్‌వాడీలు, హెల్పర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 13వ రోజుకు చేరింది. అంగన్‌వాడీ టీచర్లు సుభద్ర, నాగుబాయి, కమలబాయి, అనిత, సులోచన, రాంబాయి, దేవుబాయి, కుసువర్థ ఉన్నారు.

కుటుంబ ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

ఎదులాపురం: మహిళలు కుటుంబ ఆర్థికాభివృద్ధికి తమ వంతుగా కృషి చేయాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా అన్నారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో టీటీడీ ఆవరణలో జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో వివిధ వృత్తుల్లో శిక్షణ నేర్చుకున్న అభ్యర్థులకు శనివారం ఆమె సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వృత్తి నైపుణ్యంలో శిక్షణ పొంది ఇంట్లోనే పని చేసుకుంటూ స్వయం ఉపాధి పొందాలన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పద్మభూషణ్ రాజు మాట్లాడుతూ బ్యాంకులు, పరిశ్రమల ద్వారా గ్రూప్‌లుగా గాని ఒక్కొక్కరుగా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత యూనిట్ పరిశీలించి మహిళలకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. సెడ్స్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు, జన శిక్షణ సంస్థ చైర్మన్ ఆర్ సురేందర్, డీసీపీవో రాజేంద్రప్రసాద్, డైరెక్టర్ శ్యామల, ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజన్న, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ సంతోష్ పాల్గొన్నారు.